సాక్షి గ్రేటర్ వరంగల్


(హనుమకొండ - వరంగల్)

సోమవారం | 1 | జూలై | 2024



అశ్వారావుపేట ఎస్సై అదృశ్యం!

భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట ఎస్సైగా పనిచేస్తున్న శ్రీరాముల శ్రీను ఉదయం నుంచి అదృశ్యమై రాత్రి మహబూబాబాద్‌లో ఆత్మహత్యాయత్నం చేశాడు. - 8లో▸



వైద్యుడు.. కనిపించే దేవుడు

వైద్యుడు దేవుడితో సమానం. రోగికి ప్రాణం పోసి నిండు జీవితం ప్రసాదిస్తాడు. నేడు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. - 8లో▸

గరిష్టం/కనిష్టం

$35^0/25^0$

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఫార్మ్‌-డీ పరీక్షలు

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఫార్మ్‌–డీ 5వ సంవత్సరం విద్యార్థులకు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్‌) పరీక్షలు నేటి నుంచి నిర్వహిస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్‌.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్‌ రాధిక తెలిపారు. సోమవారం మొదటి పేపర్, 3న రెండో పేపర్, 8న మూడవ పేపర్‌ పరీక్షలు.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటాయని పేర్కొన్నారు.

రేపటి నుంచి ఎంఈడీ 4వ సెమిస్టర్‌ పరీక్షలు

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంఈడీ నాలుగో సెమిస్టర్‌ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్‌) ఈనెల 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్‌.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్‌ రాధిక తెలిపారు. జూలై 2, 3, 4, 5, 6వ తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు హెచ్‌టీటీపీ//నేషనల్‌ అవార్డ్స్‌టీచర్స్‌.ఎడ్యుకేషన్‌.గౌట్‌.ఇన్‌ వెబ్‌సైట్‌లో ఈనెల 15వ తేదీ వరకు అర్హులైన ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై తెలిపారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధి ప్రాథమిక, యూపీఎస్, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కేంద్రీయ, జవహర్‌ నవోదయ, సైనిక్‌ స్కూల్, ఆటమిక్‌ ఎనర్జీ ఎడ్యుకేషన్‌ సొసైటీ, ఏకలవ్య, మోడల్, ఆశ్రమ, సెంట్రల్‌ బోర్డు సెకండరీ ఎడ్యుకేషన్‌చే అఫ్లియేషన్‌ పొందిన సంస్థలు, ఇండియన్‌ స్కూల్‌ సర్టిఫికెట్‌ పొందిన పాఠశాలల ఉపాధ్యాయులు అర్హులని పేర్కొన్నారు. కనీసం 10 సంవత్సరాల సర్వీస్‌ కలిగి ఉండాలని, ఎంపిక ప్రక్రియ విధివిధానాలు నేషనల్‌ అవార్డ్స్‌ టీచర్స్‌ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

'సెల్ట్‌' శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీలోని సెంటర్‌ ఫర్‌ లాంగ్వేజ్‌ టీచింగ్‌(సెల్ట్‌) ఆధ్వర్యంలో 40 రోజులపాటు నిర్వహించే స్పోకెన్‌ ఇంగ్లిష్‌ అండ్‌ కమ్యూనికేషన్స్‌ స్కిల్స్‌ శిక్షణకు ఈనెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సెల్ట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఆర్‌.మేఘనరావు తెలిపారు. వర్సిటీలోని ఆసక్తిగల విద్యార్థులు రూ.1,000, బయటివారు రూ.1,500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. క్యాంపస్‌ కళాశాల నాన్‌ యూనివర్సిటీ ఫండ్‌లో ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని, ఈనెల 10న శిక్షణ ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

నేడు గ్రేటర్‌ వరంగల్‌ గ్రీవెన్స్‌

వరంగల్‌ అర్బన్‌: వరంగల్‌ మహా నగరపాలక సంస్థ(జీడబ్ల్యూఎంసీ) ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్‌ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు రాత పూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

తగ్గిన 'గరుడ' చార్జీలు

హన్మకొండ: ఆర్టీసీ గరుడ ప్లస్‌ ఏసీ బస్సు చార్జీలు తగ్గిస్తున్నట్లు వరంగల్‌–1 డిపో మేనేజర్‌ వంగల మోహన్‌రావు తెలిపారు. రాజధాని ఏసీ బస్సు చార్జీలు.. గరుడ ప్లస్‌ ఏసీ బస్సుకు వర్తింపజేస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇవి సోమవారం(నేటి) నుంచి అమల్లోకి వస్తాయన్నారు. హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు గరుడ ప్లస్‌ చార్జీ రూ.370గా నిర్ణయించామని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటో డ్రైవర్‌పై దాడి



గీసుకొండ: మచ్చాపూర్‌ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ నాయకులు కొందరు మద్యం మత్తులో ఆదివారం సాయంత్రం 5 గంటలకు హల్‌చల్‌ చేశారు. మచ్చాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్‌ క్రియాశీలక కార్యకర్త, ఆటోడ్రైవర్‌ బిల్ల భిక్షపతిపై దాడి చేశారు. భిక్షపతి మచ్చాపూర్‌ ఆటో స్టాండ్‌లో ఉండగా కాంగ్రెస్‌ నాయకులు కోల సునీల్, సంగినేని విక్రం, అప్పు మద్యం మత్తులో కర్రలు, కత్తులతో దాడి చేయగా.. ప్రాణరక్షణ కోసం పరుగులు తీశాడు. ఈ క్రమంలో డయల్‌ 100కు ఫోన్‌ చేయగా పోలీసులు పట్టించుకోకుండా తనను ఇబ్బంది పెట్టేవారికి వత్తాసు పలికారని భిక్షపతి వాపోయాడు. ఈ విషయమై బాధితుడు విడుదల చేసిన వీడియో వైరల్‌ అయింది.

ఇక ప్రగతి పరుగులు!

- గ్రేటర్‌లో కీలక ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష
- వరంగల్‌ మహా నగరాభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు



వరంగల్‌ అర్బన్‌: ఇక వరంగల్‌ మహానగరంలో అభివృద్ధి పరుగులు పెట్టనుంది. హైదరాబాద్‌లా వరంగల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే పట్టుదలతో సీఎం ఉన్నారు. 'వరంగల్‌ మహా నగర అభివృద్ధికి ఏం కావాలి? ఏవిధంగా అభివృద్ధి చేయాలి? నిధులెన్ని అవసరం.. వీటన్నింటిపై డిటైల్డ్‌ ప్రాజెక్టు రిపోర్ట్‌ (డీపీఆర్‌) తయారు చేయండి' అని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. అండర్‌ గ్రౌండ్‌ డ్రెయినేజీ.. స్మార్ట్‌ సిటీ, వరద నీటితో కాలనీలు మునగకుండా.. ట్రాఫిక్‌ నియంత్రణ.. మాస్టర్‌ ప్లాన్‌–2050.. మామునూరు ఎయిర్‌పోర్ట్‌.. సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి.. కాళోజీ కళాక్షేత్రం పనులు తదితర అంశాలపై చర్చించారు. నగరాభివృద్ధికి 27 ప్రాజెక్టులకు రూ.6,660 కోట్ల నిధులు అవసరమని అధికారులు ప్రాథమిక అంచనాలను సమర్పించారు. అయితే ఇంతటితో సరిపెట్టకుండా ఆయా విభాగాల అధికారులు సీరియస్‌గా దృష్టిసారించడంతోపాటు నిధుల విషయంలో ప్రజాప్రతినిధుల సమన్వయంతో ముందుకెళ్తే కలల నగరాన్ని సాకారం చేసుకోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇన్నర్, ఔటర్‌ రింగ్‌ రోడ్డు

ఇన్నర్‌ రింగ్‌ రోడ్డును రెండు ఫేజ్‌ల్లో 13 కిలోమీటర్ల వరకు చేపట్టాలని, భూసేకరణ పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షలో సూచించారు. జాతీయ రహదారులు, ఇతర జిల్లాలకే కనెక్టివిటీ ఉండాలన్నారు. అయితే.. 'కుడా' ఇప్పటికే రింగ్‌ రోడ్డు కోసం రూ.150 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. కానీ.. ఇక్కడ భూసేకరణే అసలు సమస్యగా మారింది. ఖమ్మం రోడ్డు నుంచి జాన్‌పీరీల వరకు, ఆరెపల్లి రోడ్డు నుంచి నర్సంపేట రోడ్డు, రోడ్డు విస్తరణకు 200 ఎకరాల వరకు ప్రైవేట్‌ భూములు కావాల్సి ఉంది. అందులో సగానికి పైగా భూములను రెవెన్యూ శాఖ సేకరించింది. రూ.120 కోట్లు భూసేకరణ డిపాజిట్‌ చేశారు. ఔటర్‌ రింగ్‌ రోడ్డుకు గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. 68 కిలోమీటర్ల మేర ప్రతిపాదించి రూ.1,476 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. అయితే ఇంత వరకు భూసేకరణ, నిధులు విడుదలకు నోచుకోక పనులు మొదలు కాలేదు.

ముంపునకు శాశ్వత పరిష్కారం చూపాలి..

వరంగల్‌లో భారీ వర్షాలు కురిసినప్పుడు కాలనీలు మునుగుతున్నాయని ఇందుకు శాశ్వత పరిష్కారం చూపాలని సీఎం అధికారులను ఆదేశించారు. నాలాల ఆక్రమణలపై దృష్టి సారించాలని సూచించారు. వాస్తవానికి నగరంలో వరద నీటితో సుమారు 150 కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. 6 ప్రధాన నాలాలు 23 కిలోమీటర్లు ఉండగా ఇతర నాలాలు 23 వరకు ఉన్నాయి. నాలాలు చాలా మేర ఆక్రమణలతో కుచించుకుపోయాయి. తొలుత నాలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపారు. వరంగల్‌ బొందివాగు నాలాకు రూ.250 కోట్ల నిధులు మంజూరయ్యాయి. 'కుడా' లే అవుట్‌ కాలనీ, నయీంనగర్‌ నాలా ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. ఇతర నాలాల, స్ట్రాంగ్‌ వాటర్‌ డ్రెయినేజీకి కోట్ల నిధులు అవసరం.

అండర్‌ గ్రౌండ్‌ డ్రెయినేజీ పనుల్లో కదలిక

అండర్‌ గ్రౌండ్‌ డ్రెయినేజీ నిర్మాణ పనుల కోసం డిటైల్డ్‌ ప్రాజెక్ట్‌ రిపోర్ట్‌ (డీపీఆర్‌) సమర్పించాలని సీఎం సూచించారు.

కాగా.. 1996 నుంచి 2017–18 వరకు పలుమార్లు డీపీఆర్‌ రివైజ్డ్‌ చేశారు. ప్రతిపాదనలు రూ.159 కోట్ల నుంచి ప్రస్తుతం రూ.1,900 కోట్లకు చేరింది. నిధులు మంజూరైతే మళ్లీ రోడ్లు ధ్వంసం కానున్నాయి.

ప్రాజెక్టులపై సీరియస్‌ ఫోకస్‌ అవసరం

స్మార్ట్‌సిటీ పథకం పనులు ఇంకెన్నాళ్లు కొనసాగిస్తారని, ఆరేళ్లు దాటినా.. పనులు పూర్తిచేయకపోవడం సరికాదని పర్యటన సందర్భంగా సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధుల కోసం కేంద్రానికి నివేదిక ఇస్తే రాష్ట్రం తరపున నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. స్మార్ట్‌సిటీ పథకంలో భాగంగా రూ.2,305 కోట్ల కీలక ప్రాజెక్టులకు ప్రతిపాదనలిచ్చామని అందులో రూ. 1,081 కోట్లకు సంబంధించి ప్రతిపాదించగా.. 15 పూర్తయినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదలైతే పెండింగ్‌ పనులు పూర్తి కానున్నాయి. ప్రాజెక్టులపై సీరియస్‌గా ఫోకస్‌ పెట్టాల్సిన అవసరం ఉంది.

మాస్టర్‌ ప్లాన్‌-2050

వరంగల్‌ దశ, దిశ సాంస్కృతిక, వారసత్వానికి తగినట్లుగా మాస్టర్‌ ప్లాన్‌–2050ను తయారు చేయాలని సీఎం సూచించారు. అయితే.. బృహత్తర ప్రణాళిక 171 గ్రామాలను కలుపుకొని 1,805 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉంది. మాస్టర్‌ ప్లాన్‌పై ప్రజల నుంచి అనేక అభ్యంతరాలున్నాయి. భవిష్యత్‌ అవసరాల కోసం రూపకల్పన చేసే ప్రణాళికల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాల్సి ఉంటుంది. అందరికీ ఆమోదయోగ్యంగా సమగ్ర వివరాలతో డిజైన్‌ చేయాల్సి ఉంది.

రుద్రేశ్వరుడిని దర్శించుకున్న కమిషనర్‌

హన్మకొండ కల్చరల్‌: హనుమకొండలోని శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయాన్ని ఆదివారం బల్దియా కమిషనర్‌ అశ్విని తానాజీ వాకడే కుటుంబసమేతంగా సందర్శించారు. మొదటిసారి ఆలయానికి వచ్చిన కమిషనర్‌ను ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. పూజలు చేసిన తర్వాత అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు, మహాదాశీర్వచనం అందజేశారు. అనంతరం కల్యాణమండపాన్ని తిలకించి ఆలయ ముందుభాగంలోని 'కుడా' గార్డెన్‌ను పరిశీలించారు. గార్డెన్‌ను శుభ్రంగా ఉంచడం లేదని, నడిచేదారిలో బండలు పగిలిపోయి ఉన్నాయని పలువురు భక్తులు కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో పరిశీలించి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్య తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది గోధుమల ప్రేమ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు ఆశీర్వచనం అందజేస్తున్న ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ

ప్రైవేట్‌ బ్యాంకులకు దీటుగా అభివృద్ధి

- వరంగల్‌ అర్బన్‌ కోఆపరేటివ్‌ బ్యాంక్‌ చైర్మన్‌ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

కాశిబుగ్గ: ప్రైవేట్‌ బ్యాంకులకు దీటుగా వరంగల్‌ అర్బన్‌ కోఆపరేటివ్‌ బ్యాంక్‌ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకు వెళ్తోందని బ్యాంక్‌ చైర్మన్‌ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ఆదివారం వరంగల్‌లోని దేశాయిపేట రోడ్డున ఉన్న కేఆర్‌ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన బ్యాంక్‌ 28వ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్‌ రూ.191.72 కోట్ల డిపాజిట్లు సేకరించడంతోపాటు రూ.136.16 కోట్ల రుణాలు ఇచ్చిందన్నారు. మొత్తం రూ.327.88 కోట్ల టర్నోవర్‌ చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత బ్యాంక్‌ ఆరు శాఖలకు అదనంగా మరో నాలుగు శాఖలు వడ్డేపల్లి, గోపాల్‌పూర్, మహబూబాబాద్, జనగామలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో బ్యాంక్‌ తెలంగాణ మొత్తం విస్తరించడానికి ప్రణాళికలు తయారు చేశామని పేర్కొన్నారు. బ్యాంక్‌ వ్యాపారంతోపాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు. సమావేశంలో వైస్‌ చైర్మన్‌ తోట జగన్నాథం, బ్యాంక్‌ డైరెక్టర్లు ముందాడా వేణుగోపాల్, కూరపాటి చంద్రమౌళి, తోట సంపత్‌కుమార్, మహ్మద్‌ గౌసొద్దీన్, డాక్టర్‌ వి.పవన్‌కుమార్, బొమ్మినేని పాపిరెడ్డి, పొన్న హరినాథ్, పోలేపాక రవికుమార్, బండారి భార్గవి, మంద స్వప్న, అప్పరాజు రాజేంద్రప్రసాద్, పుల్లూరు సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్‌ ప్రదీప్‌రావు

'స్మార్ట్‌సిటీ' గడువు పొడిగింపు

వరంగల్‌ అర్బన్‌: స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనుల గడువు పొడిగిస్తూ కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మిషన్‌ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జూన్‌ 30తో ముగిసిన గడువును పెంచుతూ 2025 మార్చి 31 వరకు ప్రాజెక్టులు పూర్తి చేయాలని ఆదేశించారు. వరంగల్, పొరుగున ఉన్న కరీంనగర్‌ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు గడువు ముగింపును దృష్టిలో పెట్టుకొని జూన్‌ 24న సీఎం రేవంత్‌ రెడ్డి ఢిల్లీ పర్యటనలో స్మార్ట్‌సిటీ గడువు పొడగించాలని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్‌ ఖట్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో కేంద్రం స్పందించి స్మార్ట్‌సిటీ గడువు పొడిగించడంతో బల్దియా, స్మార్ట్‌ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వరంగల్‌ స్మార్ట్‌సిటీలో 45 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. రూ.518 కోట్లతో 66 అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధుల మంజూరుకు ప్రయత్నించాల్సిన అవసరం ఉంది.

టూరిస్టులా వచ్చి వెళ్లాడు..

- సీఎం రేవంత్‌రెడ్డిపై 'దాస్యం' ఫైర్‌




మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్‌

హన్మకొండ: సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనతో జిల్లాకు ఒరిగిందేమీ లేదు.. ఒక టూరిస్టులా వచ్చి వెళ్లాడని బీఆర్‌ఎస్‌ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌ అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వరంగల్, హనుమకొండ పర్యటనకు సీఎం వస్తున్నారంటే వరాలు కురిపిస్తారని ఆశపడిన జిల్లా ప్రజలకు భంగపాటు తప్పలేదన్నారు. ఆజంజాహి మిల్లును కాంగ్రెస్‌ మూసేస్తే.. టీడీపీ యంత్రాలు, సామగ్రిని అమ్ముకుంది.. తెలంగాణ మొదటి సీఎం కేసీఆర్‌ మిల్లుకు దీటుగా కాకతీయ మెగా టెక్స్‌టైల్‌ పార్కు తెచ్చారని వివరించారు. టెక్స్‌టైల్‌ పార్కును సందర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి మౌలిక సదుపాయాలకు నిధులు మంజూరు చేస్తారని ఆశించామన్నారు. కేసీఆర్‌ 24 అంతస్తులతో సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తే మూడు నిమిషాలు చూసి కాంట్రాక్టర్‌ను బెదిరించి విమర్శలు చేశారే కానీ.. ఏవిధంగా వినియోగంలోకి తెస్తారో చెప్పలేదన్నారు. కాంగ్రెస్‌ ఎమ్మెల్యేలు ఎన్నికై ఏడు నెలలైనా పైసా నిధులు తేలేదని ధ్వజమెత్తారు. ఉత్తర తెలంగాణ ప్రజలకు పెద్ద దిక్కుగా ఉన్న ఎంజీఎంను సందర్శించకుండా ప్రైవేట్‌ ఆస్పత్రిని ప్రారంభించారంటే ఈ ప్రభుత్వానికి పేద ప్రజలకు వైద్య సేవలపై ఏపాటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, రాష్ట్ర రుణ విమోచన కమిషన్‌ మాజీ చైర్మన్‌ నాగుర్ల వెంకటేశ్వర్లు, టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, నార్లగిరి రమేశ్, వెంకటేశ్వర్‌ రావు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల బదిలీలకు వెబ్‌ ఆప్షన్లు

- ఎస్జీటీ కేడర్‌ బదిలీల్లో అనధికారికంగా రేషనలైజేషన్‌!
- వేకెన్సీలన్నీ చూపలేదని టీచర్ల ఆందోళన



విద్యారణ్యపురి: ఎస్జీటీ కేడర్ల బదిలీల్లో విద్యాశాఖ ఉన్నతాధికారులు అంతర్గతంగా రేషనలైజేషన్‌ చేసి అన్ని వేకెన్సీలు చూపలేదని ఆయా ఉపాధ్యాయుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. ఎస్జీటీ కేడర్‌ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియకు సీనియార్టీ జాబితాను, వేకెన్సీల జాబితాను వివిధ జిల్లాలోని డీఈఓలు వెల్లడించారు. ఆయా ఉపాధ్యాయుల బదిలీలకు వెబ్‌ ఆప్షన్లను పెట్టుకునేందుకు శనివారం రాత్రి 11 నుంచి ఆదివారం రాత్రి 10 గంటల వరకు అవకాశమిచ్చారు. కాగా.. పాఠశాలల్లోని టీచర్ల వేకెన్సీల్లో డీఈఓలు వెల్లడించినట్లు పూర్తి స్థాయి వేకెన్సీలు లేకపోవడంతో ఆందోళన వ్యక్తమైంది. హనుమకొండ జిల్లాలో 448 వేకెన్సీలు ఉన్నట్లుగా డీఈఓ సంబంధిత విద్యాశాఖ ఉన్నతాధికారులకు పంపారు. అందులో కొన్ని వేకెన్సీలు తగ్గించి చూపినట్లు తెలుస్తోంది. జీరో విద్యార్థులున్న, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలల్లో పోస్టులు తగ్గించి చూపారని సమాచారం. దీంతో ఆయా వేకెన్సీలు వెబ్‌ ఆప్షన్లకు అవకాశం లేకుండాపోయినట్లు భావిస్తున్నారు. హనుమకొండ జిల్లాలో 350 మంది ఎస్జీటీ కేడర్‌ ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా..

వరంగల్‌ జిల్లాలో 758 మంది టీచర్‌ పోస్టుల వేకెన్సీలను డీఈఓ పంపారు. కానీ.. వెబ్‌ ఆప్షన్లలో తక్కువగా చూపినట్లు తెలుస్తోంది. వరంగల్‌ జిల్లాలో 126 పాఠశాలల్లో జీరో విద్యార్థుల సంఖ్య ఉండగా.. వాటిలో 135 టీచర్‌ పోస్టుల వేకెన్సీలను వెబ్‌ ఆప్షన్లలో చూపలేదు. వరంగల్‌ జిల్లాలో 812 మంది ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. ములుగు జిల్లాలో వేకెన్సీలు 334 పంపగా.. వెబ్‌ ఆప్షన్లకు 249 వేకెన్సీలు చూపినట్లు సమాచారం. అందులో 32 వరకు జీరో విద్యార్థుల సంఖ్య పాఠశాలలున్నట్లు తెలుస్తోంది. జిల్లాల వారీగా హైస్కూళ్లలోని ఎస్జీటీ పోస్టుల వేకెన్సీలను కూడా కొన్ని చూపినట్లు సమాచారం. ఉపాధ్యాయుల వెబ్‌ ఆప్షన్ల ప్రక్రియ గందరగోళంగా కనిపించింది. కాగా.. ఈప్రక్రియ ఆదివారం రాత్రి 10గంటలవరకు కొనసాగింది. అనంతరం అర్ధరాత్రి 12 గంటల వరకు ఎడిట్‌ ఆప్షన్‌ ఇచ్చినట్లు సమాచారం. సోమవారం ఎస్జీటీ కేడర్‌ ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నట్లు భావిస్తున్నారు.

కమిషనరేట్‌లో కొత్త చట్టాలు

నేటి నుంచి ఐపీసీ స్థానంలో బీఎన్‌ఎస్‌ అమలు

- మార్పు చేసిన చట్టాలతో కేసుల్లో వేగిరానికి చాన్స్‌
- ఆర్థిక నేరాల్లో బాధితులకు సొత్తు అందే అవకాశం
- పోక్సో కేసులు పెరుగుతున్నా.. పెరగని శిక్షల శాతం
- కొత్త చట్టాలతో ఈ కేసుల్లో కదలికకు అవకాశం
- ఇప్పటికే పోలీస్‌ సిబ్బందికి దఫాల వారీగా శిక్షణ



సాక్షి, వరంగల్‌: వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో కొత్త న్యాయ చట్టాల అమలుకు రంగం సిద్ధమైంది. సోమవారం నుంచి దేశవ్యాప్తంగా ఇండియన్‌ పీనల్‌ కోడ్‌(ఐపీసీ) స్థానంలో భారతీయ న్యాయసంహిత(బీఎన్‌ఎస్‌), క్రిమినల్‌ ప్రొసీజర్స్‌ కోడ్‌(సీఆర్పీసీ) స్థానంలో భారతీయ నాగరిక్‌ సురక్ష సంహిత(బీఎన్‌ఎస్‌ఎస్‌), ఇండియన్‌ ఎవిడెన్స్‌ యాక్ట్‌ (ఐఈఏ) స్థానంలో భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్‌ఏ) చట్టాలను అమలుచేయనున్నారు. దీనిపై ఇప్పటికే పోలీసులకు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. నేరవార్తలు రాసే సమయంలో జర్నలిస్టులకు కూడా అవగాహన ఉండాలన్న ఉద్దేశంతో సదస్సులు నిర్వహిస్తున్నారు. అయితే కమిషనరేట్‌లో ఎక్కువగా జరుగుతున్న ఆర్థిక సంబంధ నేరాల్లో నిందితుల నుంచి రికవరీ కష్టసాధ్యంగా ఉండేది. ఈ కొత్త చట్టాలతో ఆర్థిక సంబంధ నేరాల్లో నిందితుల ఆస్తులు,నేరం ద్వారా సంక్రమించిన సొమ్ముతో వారు కొన్న స్థిర, చరాస్తులను జప్తు చేసే అధికారం పోలీసులకు ఉండనుండడంతో బాధితులకు సత్వర న్యాయం జరిగే అవకాశముంది. 2023లో 20 దోపిడీలు, 79 పగటి దొంగతనాలు, 249 రాత్రి దొంగతనాలు, 320 సాధారణ దొంగతనాలు, 230 ఆటోమొబైల్‌ దొంగతనాలు.. ఇలా ఆర్థిక నేరాలు నమోదయ్యాయి. వీటిలో రికవరీ ఒకటి శాతం మించలేదు. ఈకొత్త చట్టాలతో రికవరీ శాతం భారీగా పెరిగి బాధితులకు న్యాయం జరిగే అవకాశముందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

కస్టడీ కోరే గడువు పెంపుతో కేసులు కొలిక్కి..


ప్రస్తుత చట్టాల ప్రకారం నిందితుల కస్టడీ అరెస్టైన 14 రోజుల్లోపే కోరే అవకాశం ఉంటుంది. ఈ గడువును 60 రోజుల్లోపు పూర్తి చేయాల్సిన కేసుల్లో 40 రోజులకు, 90 రోజుల్లోపు పూర్తి చేయాల్సిన కేసుల్లో 60 రోజుల వరకు కొత్త చట్టాల ప్రకారం పొడిగించడంతో చాలావరకు కేసుల్లో విచారణ కొలిక్కి వచ్చే అవకాశముంటుందని పోలీసులు అంటున్నారు. వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌లో చాలావరకు కేసుల్లో పోలీసులకు నిందితుల కస్టడీ తలనొప్పిగా ఉంది. వరంగల్‌లో ఉన్న సెంట్రల్‌ జైలును కూల్చివేయడంతో నిందితులకు రిమాండ్‌ పరకాల సబ్‌ జైలు, ఖమ్మం జైలుకు, కొన్ని సందర్భాల్లో చర్లపల్లి జైలుకు పంపిస్తున్న సందర్భాలున్నాయి. వీరిని కస్టడీలోకి తీసుకోవాలనుకున్న సందర్భాల్లో పోలీసులు సుదూరం నుంచి నిందితులను తీసుకొచ్చేందుకు చాలావరకు సమయం వృథా అవుతోంది. వెంటవెంటనే కేసులు కూడా నమోదవడంతో కొన్ని సందర్భాల్లో కస్టడీ విషయంలో కొన్ని కేసులను పట్టించుకున్న దాఖలాలు లేవు. అయితే ఇప్పుడు కస్టడీ కోరే సమయాన్ని పొడిగించడంతో చాలా వరకు కేసుల్లో విచారణ కొలిక్కి వస్తుందని వరంగల్‌ సీపీ అన్నారు. అలాగే 'ఇళ్ల సోదాల ప్రక్రియ సమయంలో అనుమానాస్పద వస్తువులు స్వాధీనం చేసుకునే సందర్భంలో తారుమారు అవుతున్నాయన్న ఫిర్యాదులున్నాయి. అయితే కొత్త చట్టంతో ఇళ్ల సోదాల ప్రక్రియను పోలీసులు తప్పనిసరిగా వీడియో తీయించాలి. అనుమానాస్పద వస్తువులు స్వాధీనం చేసుకున్నప్పుడూ సంబంధిత నివేదికను న్యాయస్థానంలో 48 గంటల్లో సమర్పించాలి. దీనివల్ల వాటిని తారుమారు చేసే అవకాశం తగ్గుతుంది. దర్యాప్తు, న్యాయ విచారణ సమన్లు ఇకపై డిజిటల్‌ రూపంలో అంటే వాట్సాప్‌ తదితర మార్గాల్లో పంపే వీలుండడంతో అటు బాధ్యులు, ఇటు విచారణాధికారులు సాకులు చెప్పి తప్పించుకోలేరు' అని సామాజికవేత్త మండల పరశురాములు అభిప్రాయపడ్డారు.

పోక్సో కేసుల్లో వేగిరం

పోక్సో కేసుల విషయానికొస్తే ఏటికేడు పెరుగుతున్న నిందితులకు శిక్షల శాతం పెద్దగా ఉండడం లేదు. 2021లో 96, 2022లో 135, 2023లో 184 పోక్సో కేసులు నమోదయ్యాయి. పోలీసులు, నిందితుల బంధువుల ఎమోషనల్‌ కాంప్రమైజింగ్‌తో శిక్షల శాతం మాత్రం పెద్దగా లేదు. అయితే కొత్తగా వచ్చిన చట్టాలతో నిందితులకు సాధ్యమైనంత తొందరగా శిక్షలు పడే అవకాశం ఉంది. 'మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల్లో దర్యాప్తు రెండు నెలల్లోనే పూర్తి కావాలి. బాధితుల వాంగ్మూలాన్ని మహిళా మేజిస్ట్రేట్‌ ఎదుట నమోదుచేయాలి. వారు లేకుంటే మహిళా సిబ్బంది సమక్షంలో పురుష మేజిస్ట్రేట్‌ ఎదుట హాజరుపర్చాలి. అత్యాచార కేసుల్లో బాధితురాలి వాంగ్మూలాన్ని ఆడియో, వీడియో ద్వారా పోలీసులు నమోదు చేయాలి. పోక్సో కేసుల్లో బాధితురాళ్ల వాంగ్మూలాలను పోలీసులే కాకుండా.. మహిళా ప్రభుత్వ అధికారి ఎవరైనా నమోదు చేయొచ్చు. దీనివల్ల విచారణ వేగిరంగా జరిగి నిందితులకు శిక్ష పడుతుంది'అని వరంగల్‌ పోలీసు కమిషనర్‌ అంబర్‌ కిశోర్‌ ఝా అన్నారు. కేసు నమోదు నుంచి న్యాయ విచారణ పూర్తయ్యే వరకు ప్రతి సమాచారం ఎలక్ట్రానిక్‌ మాధ్యమం ద్వారా బాధితులకు అందనుండడంతో పారదర్శకతకు పెద్దపీట వేసినట్లుగా ఉందని తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం

హసన్‌పర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ పాఠశాల 1998–99వ సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈసందర్భంగా వారు ఒకేచోట కలుసుకుని గత స్మృతులను గుర్తుచేసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు.– హసన్‌పర్తి



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

డాక్టర్స్ డే శుభాకాంక్షలు


అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



దస్రూ మృతదేహం


గూడూరు: అప్పుల బాధతో ఓ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మచ్చర్లలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గులోతు దస్రూ (55) కుటుంబ ఖర్చుల కోసం అప్పు చేశాడు. ఆ అప్పు ఎలా తీర్చాలని భార్య ఆగమ్మతో తరుచూ చెబుతూ మనస్తాపం చెందేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి పురుగుల మందు డబ్బాతో నిద్రించగా గుర్తించిన భార్య ఆగమ్మ కేకలు వేసింది. గమనించిన పక్కింటి వారు, బంధువులు వెంటనే గూడూరులోని సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే దస్రూ మృతి చెందినట్లు వైద్యుడు తెలిపారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైద్యుడు.. కనిపించే దేవుడు



అలుపెరుగని సేవలకు సలాం..
నేడు డాక్టర్స్ డే

పాలకుర్తి టౌన్: వైద్యో నారాయణో హరి.. అనగా వైద్యుడు దేవుడితో సమానమని అర్థం. కనిపించే దేవుడు. రోగికి ప్రాణం పోసి నిండు జీవితం ప్రసాదిస్తాడు. రోగి పరేషాన్‌కు, ఏ ఆపరేషన్ చేయాలో అతడికే తెలుస్తుంది. నాడి పట్టి.. గుండె గుబుళ్లను గుర్తించి దిగులును దూరం చేసే కనిపించే దేవుడే వైద్యుడు. పవిత్రమైన వైద్య వృత్తిలో ఉంటూ ప్రమాదాల్లో పడిన జీవితాలకు పునర్జన్మ ఇస్తాడు. సోమవారం జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా వైద్యులపై 'సాక్షి' ప్రత్యేక కథనం..



సమాజంలో గుర్తింపు..

పవిత్రమైన వృత్తిలో ఉంటూ విశేష సేవలందిస్తున్న వైద్యులకు సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుంది. భయంకరమైన వ్యాధులు వచ్చిన వారి వద్దకు వెళ్లేందుకు కుటుంబ సభ్యులే భయపడుతుంటారు. అలాంటి రోగుల వద్దకు వెళ్లి ట్రీట్‌మెంట్ చేసేది కేవలం వైద్యులు మాత్రమే. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు, చివరికి కూలీలకు కూడా సెలవులుంటాయేమో.. కానీ డాక్టర్లకు మాత్రం తీరికే ఉండదు. పిల్లాపాలతో గడిపేందుకు, కుటుంబ సభ్యులకు సమయం వెచ్చించేందుకు అవకాశాలు తక్కువే.

చేదు అనుభవాలు..

డాక్టర్లకు ఆదివారాలు లేవు. ఆనందాలు లేవు. ఎమర్జెన్సీ కేసు వచ్చిందంటే ఎక్కడున్నా సరే పరిగెత్తుకుంటూ వెళ్లాల్సిందే. రోగి ప్రాణాలను నిలబెట్టేందుకు వ్యక్తిగత జీవితాలు త్యాగం చేస్తుంటారు. అలాంటి వారు ఒక్కోసారి చేదు అనుభవాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఆరోగ్య పరిస్థితి విషమించో... లేక మరే కారణాలతోనైనా రోగి మృతి చెందితే కుటుంబ సభ్యులు ఆందోళన చేయడం, దాడులకు దిగడం అక్కడక్కడ జరుగుతోంది. ఫలితంగా వైద్యుల సేవలకు, త్యాగాలకు గుర్తింపు లభించకుండా పోతోంది.

విస్తరిస్తున్న వైద్య సేవలు..

ఒకప్పుడు వైద్య సేవలు నగరాలు, పట్టణాలకు మాత్రమే పరిమితమయ్యేవి. కానీ ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించాయి. కేవలం సాధారణ వైద్యులే కాకుండా వైద్య నిపుణులు సైతం మండల కేంద్రాలకు వచ్చి పనిచేస్తున్నారు. ముఖ్యంగా అన్నిరకాల ఆస్పత్రులు క్రమంగా విస్తరిస్తున్నాయి. హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైన మల్టీస్పెషాలిటీ సేవలు నేడు గ్రామీణ చెంతకూ చేరాయి. ప్రభుత్వ ఆస్పత్రులు సైతం ఆధునికతను సంతరించుకుంటున్నాయి. మెరుగైన సేవలందిస్తూ డాక్టర్లు ప్రజామన్ననలు పొందుతున్నారు.

మానసిక ఒత్తిడి ఎక్కువే..

డాక్టర్లు వ్యక్తిగత జీవితాల్లో మానసిక ఒత్తిళ్లు ఎక్కువే ఉంటున్నాయి. వృత్తిలోని సాధకబాధకాలను అర్థం చేసుకోవాలనే ఉద్దేశంతో డాక్టర్లలో చాలాది అదే వృత్తిలో ఉన్నవారిని జీవిత భాగస్వామిగా ఎంచుకుంటారు. రోజంతా రోగుల సేవలో కనిపించే వీరు వేడుకలు, పండుగల్లో కనిపించడం చాలా అరుదు. అన్నింటినీ త్యజించి వైద్య వృత్తిని ఎంచుకుంటారు. అందులో ఇబ్బందులైనా ఎదుర్కొంటారు. కానీ ఇతరులకు చెప్పరు. అలాంటి వైద్యులను గౌరవించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

డాక్టర్స్ డే నేపథ్యం

ప్రముఖ వైద్యుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బాదన్ చంద్రరామ్ పుట్టిన రోజునే దేశంలో డాక్టర్స్‌డేగా నిర్వహిస్తున్నారు. రాయ్ 1882 జూలైన1 జన్మించారు. కలకత్తా మెడికల్ కాలేజీలో వైద్య డిగ్రీ పొందిన ఆయన.. లండన్‌లో ఉన్నత విద్యనభ్యసించి 1911లో స్వదేశానికి వచ్చి వైద్య సేవలు ప్రారంభించారు. కోల్‌కతా మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పని చేశారు. మహాత్మాగాంధీతో కలిసి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. వైద్య వృత్తిలో విశేష సేవలు అందించిన ఆయన 1962 జూలై1వ తేదీనే కన్నుమూశారు. దీంతో ఆయన సేవలకు గుర్తింపుగా 1961 భారతరత్న అవార్డుతో సత్కరించిన ప్రభుత్వం.. బాదన్ చంద్ర రామ్ జయంతి, వర్ధంతిని డాక్టర్స్‌డేగా జరుపుకోవాలని సూచించింది. అలా 1961 నుంచి మనదేశంలో జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

సైనికులు, ప్రజలకు సేవలందించడం అదృష్టం



ప్రపంచ వ్యాప్తంగా 6 దేశాల్లో, 15 రాష్ట్రాల్లో వైద్య సేవలు అందించా. దేశ రక్షణకు కృషి చేస్తున్న సైనికుల ప్రాణాలు కాపాడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్న. రెండేళ్ల పాటు ఐక్యరాజ్యసమితిలో, 6 నెలల పాటు నేపాల్ రాయబార కార్యాలయంలో పని చేశా. జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెర గ్రామంలో జన్మించిన నాకు సైనికులకు వైద్య సేవలు అందించే అవకాశం దక్కడం ఎంతో భాగ్యం. ప్రస్తుతం జనగామ ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్న.

- మాచర్ల భిక్షపతి, రిటైర్డ్ కల్నల్, ప్రముఖ వైద్యుడు

వృత్తిలో తృప్తి



వైద్య వృత్తిలో తృప్తి లభిస్తుంది. రోగులకు వైద్య సేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నాం. ఇష్టంగా ఎంచుకున్న వృత్తిలో విజయాలు సాధించినప్పుడు కలిగే ఆనందం గొప్పది. ఒక్కోసారి కొనఊపిరితో వస్తుంటారు. ఏమాత్రం ఆలస్యం చేసినా ప్రాణం పోతుంది. గ్రామీణ ప్రజలకు సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తాం.

-బుచ్చిరెడ్డి, ప్రముఖ వైద్యుడు, పాలకుర్తి

అశ్వారావుపేట ఎస్సై అదృశ్యం!

- అపస్మారక స్థితిలో మహబూబాబాద్‌లో గుర్తింపు
- పురుగుల మందు తాగి.. 108కు ఫోన్ చేసిన ఎస్సై
- పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ తరలింపు



అశ్వారావుపేటరూరల్/మహబూబాబాద్‌రూరల్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను అదృశ్యమైన ఘటన ఆదివారం కలకలం రేపింది. ఉదయం నుంచి ఆయన రాకుండా పోగా.. రాత్రి 11గంటలకు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుతున్న సమయాన స్వయంగా ఆయనే 108కు ఫోన్ చేశాడు. దీంతో సిబ్బంది మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ తరలించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేటకు చెందిన శ్రీను అశ్వారావుపేటలో ఐదు నెలలుగా ఎస్సైగా విధులు నిర్వర్తిస్తుండగా, ఆదివారం ఉదయం 8గంటలకు స్టేషన్‌కు వచ్చి సిబ్బందితో మాట్లాడారు. ఆ తర్వాత కారు నడుపుకుంటూ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన వద్ద రెండు సెల్ నంబర్లు స్విచ్ఛాఫ్ రావడంతో సిబ్బంది సీఐ జితేందర్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయన విచారణ చేపట్టగా అశ్వారావుపేట మండలం తిరుమలకుంట అటవీ ప్రాంతంలో స్విచ్ఛాఫ్ అయ్యాయని గుర్తించినట్లు తెలిసింది. రాత్రి 10.30 గంటల వరకు కూడా ఎస్సై ఆచూకీ లభించక సిబ్బంది గాలింపు ముమ్మరం చేశారు. కొద్ది రోజులుగా ఎస్సైపై వస్తున్న అవినీతి ఆరోపణలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలుస్తుండగా.. స్టేషన్‌లోని సిబ్బందికి, ఎస్సై మధ్య విభేదాలు ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలోనే సిబ్బంది సైతం జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయగా ఎస్సై నాలుగు రోజులు సెలవులో వెళ్లి బుధవారమే విధుల్లో చేరారు. ఆయనపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులతోనే ఆవేదన చెందినట్లు ప్రచారం జరుగుతోంది.

పురుగుల మందు తాగి.. 108కు ఫోన్

అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి 11గంటల మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ సమీపాన పురుగుల మందు తాగిన ఎస్సై.. స్వయంగా 108కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో డీఎస్పీ తిరుపతిరావు, మహబూబాబాద్ రూరల్, గూడూరు సీఐలు సర్వయ్య, బాబురావుతోపాటు 108 సిబ్బంది చేరుకుని ఆయనను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం ఎస్సై పరిస్థితి విషమంగా ఉండడంతో అర్ధరాత్రి 12గంటలకు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

నెల్లికుదురు : వివాహేతర బంధం ఒకరి ప్రాణం తీసింది. అవమానభారంతో పురుగుల మందు తాగిన దంపతుల్లో భార్య మృతి చెందగా భర్త చికిత్స పొందుతున్నాడు. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం పెద్దతండా చెందిన బానోత్ నీలమ్మ (36)కు అదే తండాకు చెందిన బానోత్ వీరన్నతో వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ నెల 29న రాత్రి నీలమ్మ ఇంటికి వెళ్లి బలవంతం చేయబోయాడు. దీంతో దంపతులు.. వీరన్నను బతిమిలాడి తమ పరువు తీయొద్దని ఎంత ప్రాధేయపడినా వినలేదు. తండాలో ప్రచారం చేశాడు. దీంతో మనస్తాపం చెంది అవమాన భారం భరించలేక దంపతులు ఆదివారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా నీలమ్మ మృతి చెందింది. భర్తను తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

- యువకుడికి తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అభిలాష్

ఐనవోలు: బైక్‌ను లారీ ఢీకొట్టడంతో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని వరంగల్–ఖమ్మం రహదారి పున్నేలు క్రాస్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మామిండ్ల అభిలాష్ తన చెల్లి సర్టిఫికెట్‌లు వారి బంధువులు పున్నేలు క్రాస్ వద్ద ఇస్తానని తెలుపడంతో తండ్రి మామిండ్ల తిరుపతి బైక్‌పై పున్నేలు క్రాస్ వద్దకు చేరుకున్నాడు. ఈ క్రమంలో వైజాగ్ నుంచి వరంగల్ మీదుగా రాజస్థాన్‌కు వెళ్తున్న లారీ.. డ్రైవర్ అజాగ్రత్త, అతివేగంగా నడపడంతో అభిలాష్ నడుపుతున్న బైక్‌ను ఢీకొట్టింది. కొద్ది దూరం ముందుకు అలాగే వెళ్లడంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. బైక్ పూర్తిగా ధ్వంసమైంది. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రున్ని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, అభిలాష్‌ను మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎడమ కాలు పూర్తిగా తొలగించడంతోపాటు పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. అభిలాష్ తాత రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

ఎంపీపీ తిరుపతిరెడ్డిపై ఛీటింగ్ కేసు

శాయంపేట : పట్టా పాస్ బుక్‌లో పేరు ఎక్కిస్తానని నమ్మబలికి రైతు వద్ద రూ.50వేలు తీసుకొని మోసం చేసిన శాయంపేట ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డిపై బాధిత రైతు ఫిర్యాదు మేరకు ఆదివారం ఛీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన చిలుకల కొమురయ్యకు నేరేడుపల్లె గ్రామ శివారులో 4ఎకరాల 32గుంటల భూమి ఉంది. తెలంగాణ ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన పాస్‌బుక్‌లో కొమురయ్యకు 2ఎకరాల 12గుంటల భూమి మాత్రమే నమోదైంది. ఈ క్రమంలో కొమురయ్య తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. దీంతో అదే గ్రామానికి చెందిన ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డిని సంప్రదించగా రూ.50వేలు తనకు ఇస్తే పని అవుతుందని చెప్పాడు. దీంతో కొమురయ్య.. రూ.50వేలు అదే గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి వేణు ద్వారా తిరుపతి రెడ్డికి ఇప్పించాడు. కాగా, డబ్బులు ఇచ్చి మూడు సంవత్సరాలు గడిచినా పనికాకపోవడంతో కొమురయ్య తన డబ్బు తిరిగి ఇవ్వాలని కోరాడు. అయినా ఇవ్వకపోవడంతో ఎంపీపీ మెతుకు తిరుపతి రెడ్డి, పెద్దిరెడ్డి వేణులపై కొమురయ్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు.

కందిపప్పు, కారంపొడిపై చెక్ టెస్టులు



సమావేశంలో మాట్లాడుతున్న చక్రపాణి

వరంగల్: తెలంగాణలో ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో కందిపప్పు, కారంపొడిలో కల్తీ జరుగుతున్నందున ఈనెల 3వ తేదీ నుంచి ఆహార కల్తీపై చైతన్య సదస్సులు, టెస్ట్ చెక్‌లు నిర్వహించేందుకు వినియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ తీర్మానం చేసిందని మండలి అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి తెలిపారు. ఆదివారం వరంగల్‌లో జరిగిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హానికరమైన కల్తీ వల్ల వినియోగదారులు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కంది పప్పు ధర కిలో రూ.140నుంచి రూ.180వరకు అమ్మకాలు జరుగుతున్నందున కొందరు అధిక లాభార్జన కోసం కందిపప్పులో ఉత్తర భారతదేశంలో విరివిగా పండే బత్రి పప్పు, బఠాణీ పప్పులకు సింథటిక్ కలర్స్ వాడి కలుపుతున్నారని తెలిపారు. మహారాష్ట్రలోని ఇండోర్‌లో చౌకగా దొరికే బత్రి, బఠాణీ పప్పులను కలపడం వల్ల వ్యాపారస్తులకు అతిగా లాభం, వినియోగదారులకు హానికరమైన ఉదర కోశ వ్యాధులు సంక్రమిస్తున్నాయని అన్నారు. ఇటీవల హనుమకొండలో నిర్వహించిన టెస్ట్ చెక్‌లో వినియోగదారుల మండలికి అందిన ఫిర్యాదుల మేరకు, మండలి రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారుల చైతన్య కార్యక్రమాలు, టెస్ట్ చెక్‌లను నిర్వహించనున్నదన్నారు. అదే విధంగా వరంగల్, ఖమ్మం మార్కెట్‌ల నుంచి పెద్ద ఎత్తున సేకరించిన తాలు మిరప(తెల్ల మిరప)పొడికి సింథటిక్ కలర్స్, సూడాన్ వంటి హానికరమైన కలర్స్ కలపడం వల్ల వినియోగదారులు రోగాలకు గురవుతున్నారని అన్నారు. అనేక చోట్ల ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లలో కడుపునొప్పికి గురవుతున్న సంఘటనలు జరుగుతున్నాయని, దీనికి ఆహార కల్తీయే కారణమన్నారు. ఈసమావేశంలో సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిళిచెర్ల సుదర్శన్, హైకోర్టు న్యాయవాది యశ్వంత్ కుమార్, జిల్లా కార్యదర్శులు రావుల రంజిత్‌కుమార్, అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో సహా వివాహిత అదృశ్యం



శైలజ

చెన్నారావుపేట: భర్తతో గొడవపడిన వివాహిత పిల్లలతో సహా అదృశ్యమైంది. ఈ ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం జోజిపేట నారాయణ తండాలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై గూడ అరుణ్‌కుమార్ కథనం ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన బానోతు శైలజ.. భర్తతో గొడవపడి శనివారం ఉదయం తన ఇద్దరు పిల్లలు వర్షిత, అభిషేక్‌ను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వివాహిత తండ్రి గుగులోత్ రంజ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు.

తమ్ముడి భూమిని దున్నిన అన్నపై కేసు

శాయంపేట : తమ్ముడి భూమిని అక్రమంగా దున్నిన అన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని తహరాపూర్‌కు చెందిన లక్కర్సు మొగిలి, రమేశ్ అన్నదమ్ములు. వీరికి తల్లిదండ్రుల వారసత్వంగా చెరో ఎకరం 20గుంటల భూమి వచ్చింది. ఇందులో రమేశ్ తన వాటాను బిడ్డకు ఇచ్చుకొని తానే కౌలుకు సాగుచేస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి మళ్లీ భూమి పంచాలంటూ రమేశ్.. మొగిలిని ఇబ్బందులకు గురిచేస్తుండగా భూమి పంచడం కుదరదంటూ మొగిలి చెప్పాడు. దీంతో రమేశ్ ఈ నెల 17న తమ్ముడి భూమిలో దున్ని పత్తి విత్తనాలు నాశనం చేశాడు. దీంతో మొగిలి ఫిర్యాదు మేరకు రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన రమేశ్ మాట్లాడుతూ.. తన సోదరుడు ఫిర్యాదు చేశాడని స్టేషన్‌కు రప్పించిన ఎస్సై.. దుర్భాషలాడుతూ తనపై చేయిచేసుకున్నాడని చెప్పడం కొసమెరుపు.

వరంగల్ ఆర్డీఓ దత్తు అరెస్టు కలకలం

- ఆసిఫాబాద్‌లో పనిచేసినప్పుడు భూసేకరణలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు
- శనివారం రాత్రి కలెక్టరేట్‌లో అదుపులోకి తీసుకున్న కరీంనగర్ ఏసీబీ అధికారులు



కాళోజీ సెంటర్: అవినీతి, ఆరోపణలతో వరంగల్ ఆర్డీఓ సిదాం దత్తును కరీంనగర్ ఏసీబీ అధికారులు శనివారం రాత్రి కలెక్టరేట్‌లో అరెస్టు చేయడం ఉద్యోగుల్లో కలకలం సృష్టించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కలెక్టరేట్ ఉద్యోగులు, ఆర్డీఓ దత్తు బిజీబిజీగా ఉన్నారు. సీఎం పర్యటన ముగించుకొని హైదరాబాద్ వెళ్లిన తర్వాత ఏసీబీ అధికారులు ఆర్డీఓ దత్తును కలెక్టరేట్‌కు పిలిపించుకొని అరెస్టు చేశారు. రాత్రి కావడంతో విషయం ఎవరికి తెలియకుండా పోయింది. ఆదివారం ఉదయం ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది దత్తు కోసం ఆరాతీయగా విషయం తెలియడంతో ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. 2019లో ఆసిఫాబాద్ ఆర్డీఓగా దత్తు పనిచేసినప్పుడు భూసేకరణలో అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి సంబంధించి భూసేకరణలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు శంభుదాసు, మాజీ సర్పంచ్ ప్రక్షాళనగౌడ్‌తో ఆయన కుమ్మక్కయ్యారని తెలిసింది. రోడ్డు నిర్మాణంలో సదరు వ్యాపారుల భూమి పోకున్నా పోయినట్లుగా ప్రభుత్వ భూమిని రికార్డులో చూపించి అవకతవకలకు పాల్పడినట్లు సమాచారం. సహకరించిన ల్యాండ్ రికార్డు సర్వేయర్ భరత్‌కు రూ.60 లక్షలు, ఆర్డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు రూ.30 లక్షలను ముట్టజెప్పి సుమారు నాలుగు కోట్ల రూపాయలను దుర్వినియోగం చేసినట్లు వినికిడి. ఇందుకు సహకరించిన దత్తుకు కోటి రూపాయలు ముట్టినట్లు తెలిసింది. ఈ నాలుగు కోట్ల రూపాయలను రియల్ ఎస్టేట్ వ్యాపారి శంభుదాస్ కారు డ్రైవర్ తిరుపతి బ్యాంకు ఖాతాల్లో జమచేసి ఆర్డీఓ దత్తు బంధువులకు ముట్టజెప్పినట్లు తెలిసింది. శంభుదాస్ ఆర్థికపరమైన విషయాల్లో మోసం చేయడంతో తిరుపతి ఏసీబీ అధికారులను సంప్రదించి విషయాన్ని చెప్పాడు. దీంతో రెండు నెలల నుంచి విచారణ చేస్తున్న ఏసీబీ అధికారులు తిరుపతి బ్యాంకు ఖాతా వివరాలను పరిశీలించారు. 1.50 కోట్ల రూపాయల లావాదేవీలను ఆయన ఖాతాలో వారు గుర్తించినట్లు తెలిసింది. ఈ విషయం ఆర్డీఓ దత్తుకు గత నెలలోనే తెలియడంతో బెయిల్ కోసం 12న, 20వ తేదీన ప్రయత్నించాడు. బెయిల్ దొరకకపోవడంతో శనివారం రాత్రి వరంగల్ కలెక్టరేట్‌లో ఆర్డీఓ దత్తును ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.